క్లుప్తంగా

తూర్పుముఖ ఆంజనేయుడికి విశేష పూజలు



ఫిరంగిపురం: మండలంలోని వేములూరిపాడులోని తూర్పుముఖ ఆంజనేయుడికి చైత్రశుద్ధ మంగళవారం పౌర్ణమిని పురస్కరించుకొని అర్చకులు విశేష పూజలు చేశారు. స్వామికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అష్టోత్తర, సహస్రనామాలతో నాగవల్లీ దళార్చనలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

విద్యార్థులకు ప్రగతి పత్రాలు అందజేత



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని సెయింట్ ఆన్స్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో మంగళవారం విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా హెచ్‌ఎం సిస్టర్ కొమ్మారెడ్డి నిర్మలమేరి మాట్లాడుతూ క్రమశిక్షణతోనే విద్యార్థులు మంచి మార్కులు సాధించగలుగుతారని చెప్పారు. పాఠశాల వద్దనే కాకుండా తల్లిదండ్రులు తమ పిల్లలను కొంతసేపు ఇంటివద్ద చదువుకునేలా చూడాలని తెలిపారు. వేసవి సేలవల్లో ఎండ ఎక్కువగా ఉన్నసమయాల్లో పిల్లలు బయటకు వెల్లనీవకుండా చూసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు వారి తల్లిదండ్రుల సమక్షంలో ప్రగతి పత్రాలు అందజేశారు.

పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి



తాడేపల్లిరూరల్: పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కార్మికులు ఎంటీఎంసీ కమిషనర్ నిర్మల్ కుమార్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజీ మాట్లాడుతూ రెండు నెలల నుంచి జీతాలు, హెల్త్ అలవెన్స్ రాక పోవడంతో కార్మికులు అప్పులు చేయాల్సి వస్తోందని, సంవత్సర నుంచి ఇవ్వాల్సిన సబ్బులు, కొబ్బరినూనె, చెప్పులు, యూనిఫాం ఇవ్వకపోవడం దారుణమన్నారు. విలీన గ్రామాల కార్మికులకు పెంచిన జీతం రూ.21 వేలు వెంటనే అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎస్.ఎస్.చంగయ్య, ఎం.రవి, దొంతిరెడ్డి వెంకటరెడ్డి, బూరుగ వెంకటేశ్వర్లు, వేముల దుర్గారావు, వై.శివనాగేశ్వరరావు, వెంగమ్మ పాల్గొన్నారు.

తాడికొండలో 2 నామినేషన్లు దాఖలు

తాడికొండ: తాడికొండ అసెంబ్లీ నియోజకవర్గానికి మంగళవారం రెండు నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.గంగరాజు తెలిపారు. ఉదయం నవరంగ్ కాంగ్రెస్ పార్టీ తరఫున గుర్రం రామారావు నామినేషన్ దాఖలు చేయగా మధ్యాహ్నం ఇండిపెండెంట్ అభ్యర్థి గొడవర్తి ప్రసన్న కుమార్ నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అందజేశారు. ఇప్పటి వరకు తాడికొండ అసెంబ్లీ స్థానానికి మొత్తం 10 సెట్లు నామినేషన్ పత్రాలు దాఖలైనట్లు తెలిపారు.

మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ

తాడికొండ: ఉపాధి హామీ కూలీలకు వైఎస్సార్ సీపీ మండల సేవాదళ్ అధ్యక్షుడు బెజ్జం సాయి ప్రసాద్ మజ్జిగ ప్యాకెట్లు, మజా, వాటర్ బాటిళ్లు మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెర్రిపోతు రోసిబాబు, బెజ్జం రాజేష్, బోరుగడ్డ ఏలియా, కొచ్చెర్ల సుబ్బారావు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం ఘనత సీఎం వైఎస్ జగన్‌దే

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి లావణ్య
- మంచికలపూడి, కేఆర్ కొండూరులో విస్తృత ప్రచారం
- ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆర్కే సతీమణి రాధాదేవి



మంచికలపూడి రోడ్‌షోలో చిన్నారిని ముద్దాడుతున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి లావణ్య, పక్కన ఎమ్మెల్యే సతీమణి రాధాదేవి, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల

తాడేపల్లిరూరల్: అభివృద్ధి, సంక్షేమం అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని మంగళగిరి వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి మురుగుడు లావణ్య పేర్కొన్నారు. దుగ్గిరాల మండలం మంచికలపూడి, శంరాజు కొండూరులలో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచార కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) సతీమణి రాధాదేవి, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల, ఆప్కో మాజీ చైర్మన్ గంజి చిరంజీవి, ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ, తాడేపల్లి పట్టణ అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాలసోమిరెడ్డి సతీమణి రోజారాణి పాల్గొన్నారు. గ్రామంలో ఫ్యాన్ గుర్తుపై అమూల్యమైన ఓటు వేసి గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య, ఎమ్మెల్యే అభ్యర్థి మురుగుడు లావణ్యను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల, ఆప్కో మాజీ చైర్మన్ గంజి చిరంజీవి మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేసినట్లు చెప్పారు. ఇచ్చిన హామీలలో నూరు శాతం అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని వివరించారు. దుగ్గిరాల మండలంలో 18 గ్రామాల్లో జగనన్న కాలనీలను ఏర్పాటు చేసి 2,678 మందికి స్థలాలు ఇచ్చినట్లు తెలిపారు. ఇంటి నిర్మాణం చేసి, ఒక్క రూపాయి ఖర్చు లేకుండా రిజిస్ట్రేషన్ చేయించామని వివరించారు. వలంటీర్ల ద్వారా సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్‌దేనని పేర్కొన్నారు. దుగ్గిరాలలో ఎక్కువశాతం వ్యవసాయం, వ్యవసాయ ఆధారిత పనులపై ఆధారపడి జీవిస్తుండడంతో రైతులు తమ పంట పొలాలకు వెళ్లేందుకు 90 శాతం డొంక రోడ్లను మంగళగిరి ఎమ్మెల్యే ఆర్కే చొరవతో ప్రభుత్వ సహాయంతో నిర్మించినట్లు తెలిపారు. రైతుల పంట పెట్టుబడి కోసం ముందుగానే రైతుల ఖాతాల్లో నగదును బదిలీ చేస్తున్నారని, ప్రతి గ్రామాన్ని ఒక సచివాలయంగా ఏర్పాటు చేసి ప్రజలకు అవసరమైన సేవలను మన గ్రామంలోనే జరిగే విధంగా ప్రభుత్వం ప్రణాళిక రూపొందించిదని చెప్పారు. రైతులకు విత్తనాలు, ఎరువులు కావాలంటే అదే గ్రామంలో రైతు భరోసా కేంద్రాన్ని ఏర్పాటు చేసి సబ్సిడీపై ఎరువులు, విత్తనాలు, అందజేయడంతో పాటు రైతులు పండించిన పంటలకు అవసరమైన సూచనలు సలహాలు ఇచ్చేందుకు సిబ్బందిని ఏర్పాటు చేశారని వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంటి వద్దకే పరిపాలన తీసుకొచ్చి, ఇంటింటికి వైద్యులను పంపించి సేవలు అందిస్తున్నారని గుర్తుచేశారు. మరోసారి ఫ్యాన్ గుర్తుపై అమూల్యమైన ఓటు గుర్తు వేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేస్తే మన పిల్లల భవిష్యత్‌లో కూడా ఎంతో మార్పు వస్తుందని అన్నారు. కార్యక్రమంలో బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు డి.వెంకటేశ్వరరావు, జిల్లా సభ్యులు వి.రజనీకాంత్, పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.రత్నం, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ బాజీ, మైనార్టీ సెల్ నాయకులు షేక్ సుభాని, ఎస్సీ సెల్ నాయకులు వీరయ్య, ఎంపీటీసీలు కొండూరు సుభాని, సర్పంచులు బాణావత్ ఖుషీబాయి, ఉన్నం ఝాన్సీరాణి, ఇత్తడి రమేష్‌బాబు, దాసరి సుందరమ్మ, యార్లగడ్డ శ్రీచంద్ర దుర్గా భవాని, గంపల గంగాధరరావు, షేక్ అజీజున్, షేక్ జానీబాషా, వైఎస్సార్ సీపీ నాయకులు వై.రవీంద్ర, ధనుంజయ్, వై.చిన్ని, పి.ధర్మరత్నం, జి.ఫణీంద్ర, వి.రమేష్, ఎ.నాగేశ్వరరావు, ఎండీ బాజీ, షేక్ నాగూర్, ఎ.వెంకటరావు, కె.కర్బ్యారావు, ఎన్.కోటేశ్వరరావు పాల్గొన్నారు.



లావణ్య విజయాన్ని కాంక్షిస్తూ హారతి ఇస్తున్న మహిళ



తాడేపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

తాడేపల్లిలో ఎన్నికల ప్రచారం

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లిలో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ విస్తృతంగా ఎన్నికల ప్రచారం మంగళవారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి, జేసీఎస్ జిల్లా కో ఆర్డినేటర్ ఈదులమూడి డేవిడ్‌రాజు, తాడేపల్లి పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి రామకృష్ణారెడ్డి, మాజీ కౌన్సిలర్లు ఎండీ గోరె, లక్ష్మీరోజ, ఎస్సీ, ఎస్టీ, బీసీ సెల్ పట్టణ అధ్యక్షుడు ముదిగొండ ప్రకాష్, బాలసాని అనిల్, బత్తుల దాసు, ఉండ్రు కళ్యాణ్ ఆధ్వర్యంలో పలు వార్డులలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు బుర్రముక్కు మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ పనిచేసిందని చెప్పారు. దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించినట్లు చెప్పారు. నవ్యాంధ్ర ఏర్పడిన తరువాత 2014 నుండి 2019 వరకు అధికారంలో వున్న తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ప్రజలను పట్టించుకోలేదని చెప్పారు. రాజధాని ప్రాంతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు ఇళ్ల కేటాయిస్తే కోర్టుకు వెళ్లి అడ్డుకున్న టీడీపీ, ఇప్పుడు 20 వేల మందికి ఇళ్లు ఇస్తామని చెబుతుండడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. ఎక్కడ ఎలా ఇస్తారో చెప్పడం లేదని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి అయితే మంగళగిరి నియోజకవర్గంలోని ఎంటీఎంసీ పరిధిలో ఇళ్లు లేని అక్కా చెల్లెమ్మలకు ఇళ్లు నిర్మించి ఇస్తారని చెప్పారు. కార్యక్రమంలో కస్తూరి అమర్, కొండా విజయలక్ష్మి, కళ్లం రాజశేఖరరెడ్డి, కుమారి, సచివాలయ కన్వీనర్లు షేక్ అబ్దుల్లా, మృత్యుంజయ్, సుభాని, రమణ, జోజప్ప, సుందరరావు, మీరా, మరియన్న, డింగర్ శ్రీను, బాబు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో గడ్డికి నిప్పు



తాడికొండ: తాడికొండ తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఖాళీగా ఉన్న పది ఎకరాల స్థలంలోని పచ్చగడ్డికి మంగళవారం నిప్పు అంటుకుంది. గడ్డి ఎండిపోయి ఉండటంతో ప్రమాదవశాత్తు జరిగిన ఘటనగా భావిస్తున్నారు. సమాచారం అందుకున్న తహసీల్దార్ మధుసూదనరావు ఎన్నికల విధుల నుంచి ఘటనా స్థలానికి చేరుకొని ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. స్థానికంగా అందుబాటులో ఉన్న ట్యాంకర్ల ద్వారా కార్యాలయ సిబ్బందితో కలిసి మంటలు అదుపులోకి తెచ్చేందుకు యత్నించారు. అగ్నిమాపక సిబ్బంది సకాలంలో చేరుకొని మంటలను అదుపులోకి తీసుకురావడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

ప్రకటన

... Shriram Finance Ltd. ...

T.V.N.వాసుదేవరావు

తాడికొండలో ఉలిక్కిపడ్డ టీడీపీ



సోమవారం మేకతోటి సుచరిత నామినేషన్ కార్యక్రమానికి హాజరైన ప్రజలు

- ఎమ్మెల్యే సుచరిత నామినేషన్‌కు భారీగా ప్రజలు రాక
- అమరావతి రాజధాని మంత్రం ఫలించలేదని ఆందోళన

తాడికొండ: తాడికొండలో తెలుగుదేశం పార్టీ ఒక్కసారి ఉలిక్కిపడింది. ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మేకతోటి సుచరిత నామినేషన్‌కు అంచనాలకు మించి ప్రజలు హాజరు కావడంతో ఉక్కిరిబిక్కిరి అయిపోతున్నారు. ఈ నెల 19న టీడీపీ అభ్యర్థి తెనాలి శ్రావణ్ కుమార్ నామినేషన్ కార్యక్రమానికి 5 వేల మంది కూడా హాజరు కాలేదు. అయితే దీనిని కూడా తమకు అనుకూలంగా మలచుకోవాలనే ఆలోచనతో 10 వేల మందికి పైగా కార్యకర్తలు హాజరయ్యారని ప్రచారం చేసుకుంటున్నారు. సోమవారం అధికార పార్టీకి చెందిన అభ్యర్థిగా మేకతోటి సుచరిత నామినేషన్ కార్యక్రమానికి అంచనాలకు మించి కార్యకర్తలు, నాయకులు, మహిళలు స్వచ్ఛందంగా 25 వేల మందికి హాజరై అడుగడుగునా ఘన స్వాగతం పలకడంతో గుంటూరు నుంచి తాడికొండకు 5 గంటల పాటు నామినేషన్ ర్యాలీ భారీగా కొనసాగింది. తుళ్ళూరు మండలంలో టీడీపీకి చెందిన పలువురు సీనియర్ నాయకులు నిఘా వర్గాలకు ఫోన్‌లు చేసి అంతమంది హాజరయ్యారా ... నిజమేనా ఆరా తీసినట్లు సమాచారం. ఇప్పటికే అమరావతి పేరుతో నియోజకవర్గంలో రైతుల ముసుగులో ఉన్న టీడీపీ నాయకులు ప్రచార రథం ఏర్పాటు చేసుకొని మరీ ఇంటింటికీ తిరిగి ఓటు బ్యాంకు రాజకీయాలు మొదలుపెట్టారు. కానీ ప్రజల్లో మాత్రం సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన పథకాలపై ఆదరణ ఏంటో ఇప్పుడు కళ్లారా కనిపించడంతో తట్టుకోలేక చావుతప్పి కన్నులొట్టబోయిన చందంగా ఆలోచనలో పడ్డారు. తుళ్ళూరు మండలం నుంచే 5 వేల మంది ప్రజలు స్వచ్ఛందంగా నామినేషన్‌కు తరలిరావడం అసలు మింగుడు పడని విషయం. రాజధాని ప్రాంతంలో భూములిచ్చిన రైతులకు సీఆర్డీయే చట్టం ప్రకారం సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రతి ఏటా కౌలు పరిహారం చెల్లించడంతో పాటు రాజధాని రైతు కూలీలకు ఇస్తున్న రూ.2500 జీవన భృతి పింఛన్‌ను రూ.5 వేలకు పెంచి సీఎం అందించారు. గత ప్రభుత్వంలో జీవన భృతి పింఛన్‌లు ఏ మూడు నెలలకో 4 నెలలకో బాబుకు బుద్ధిపుడితే కానీ వచ్చేవి కాదు అది కూడా ఆయనకు పలుమార్లు మొరపెట్టుకుంటేనో లేక నిరసనలు తెలియజేస్తేనో ఇచ్చేవారు. కానీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అందుకు భిన్నంగా ప్రతి నెలా ఒకటో తేదీనే సాధారణ పింఛన్లతో పాటు జీవన భృతి పింఛన్లు కూడా నేరుగా ఇంటి వద్దకే అందజేస్తుండటంతో ఆ వర్గాలకు మేలు జరిగి అందరూ సంతృప్తిగా ఉన్నారు. రాజధాని సీటు మాదే అంటూ బీరాలు పలికిన బెట్టింగ్ బంగార్రాజులు ఇప్పటికే ఈ సీటుపై రూ.లక్షల్లో పందేలు కాశారు, అయితే నామినేషన్ పుణ్యమా అని ప్రజా తీర్పు ఉల్టా పల్టా అయ్యే పరిస్థితి ఉండటంతో బెంగెట్టుకొని దిగులుతో కూర్చున్నారు. ఇది ఎస్సీ నియోజకవర్గం కావడం, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీల ఓట్లు అధికంగా ఉండటంతో పేద వర్గాలు వైఎస్సార్ సీపీకి అండగా ఉంటాయనే బెంగ వీరికి ఎక్కువైంది.

ఎమ్మెల్యే సుచరితకు కృతజ్ఞతలు

తాడికొండ: వైఎస్సార్ సీపీ సేవాదళ్ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమితులైన దానం వినోద్‌కుమార్, ఎమ్మెల్యే, తాడికొండ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మేకతోటి సుచరితకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ పదవి వచ్చేందుకు సహకరించినందుకు ధన్యవాదాలు తెలుపుతూ శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించారు.



ఎమ్మెల్యే మేకతోటి సుచరితకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వినోద్

ప్లాస్టిక్ రహిత నగరానికి ప్రజలు సహకరించాలి

ఎంటీఎంసీ కమిషనర్ నిర్మల్ కుమార్



తాడేపల్లిరూరల్: మంగళగిరి– తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని ప్రజలు, వ్యాపార సంస్థలు ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దడానికి సహకరించాలని ఎంటీఎంసీ కమిషనర్ నిర్మల్ కుమార్ అన్నారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ప్రజలు, వ్యాపార సంస్థలు 75 మైక్రాన్‌ల కంటే తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ సంచులు, ప్లాస్టిక్ పేపర్లు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ బాటిల్స్ వినియోగించడంతో పాటు విక్రయించకూడదని, ప్రభుత్వ నిషేధాజ్ఞలు కచ్చితంగా అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. నిబంధనలకు విరుద్ధంగా ప్లాస్టిక్ సంచులు వినియోగించడం, అమ్మకాలు జరపడం చేసిన వారిపై జరిమానా విధించనున్నట్లు హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా మార్కెట్‌కు వెళ్లేటప్పుడు ఇంటి వద్ద నుంచి క్లాత్, పేపర్, జ్యూట్‌లతో తయారు చేసిన సంచులను వెంట తీసుకువెళ్లాలని సూచించారు. నగరంలో నిషేధిత ప్లాస్టిక్ విక్రయిస్తున్న వ్యాపార సంస్థలపై నగరపాలక సంస్థ, సచివాలయ సిబ్బందిని ప్రత్యేక బృందాలుగా ఏర్పాటు చేసి తనిఖీలు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

నిత్యం వార్తా పత్రికలు చదవాలి

ఎమ్మెల్సీ లక్ష్మణరావు



లక్ష్మణరావును సత్కరిస్తున్న దృశ్యం

తాడేపల్లిరూరల్: విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ సమాజంలో ఏం జరుగుతుందో తెలుసుకోవాలంటే నిత్యం వార్తాపత్రికలను చదవాలని, అప్పుడే ఆయా ప్రభుత్వాలు తీసుకునే విధాన పరమైన నిర్ణయాలకు కారణాలు అర్థమవుతాయని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. మంగళవారం ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ వర్సిటీలో నిర్వహించిన నేషనల్ సివిల్ సర్వీసెస్‌డే వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ లక్ష్మణరావు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ కేవలం పుస్తకాల పురుగుల్లా ఉంటే సమాజం అర్థం కాదని, దాని వలన విద్యార్థులు విజయానికి దూరమయ్యే అవకాశాలు ఉన్నాయని అన్నారు. నిత్య సామాజిక చింతన విజయానికి చేరువ చేస్తుందన్నారు. బీఏ విభాగాధిపతి డాక్టర్ బి.శివనాగయ్య మాట్లాడుతూ మనసుకు ఏకాగ్రత కలగాలంటే చుట్టూ ఆహ్లాదకరమైన వాతావరణం ఉండాలని అన్నారు. బీఏ అకడమిక్స్‌కు అందరూ పీహెచ్‌డీ కలిగిన అధ్యాపకులు, సివిల్ సర్వీసెస్‌కు సివిల్ సర్వీసెస్‌లో మెయిన్స్ పాసయి ఇంటర్వ్యూ వరకు వెళ్లిన నిపుణులతో ఐఏఎస్ శిక్షణ అందజేస్తున్నామని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వంలో ఆడిటర్‌గా విధులు నిర్వహిస్తున్న కె.దేవీ ప్రసాద్ మాట్లాడుతూ ప్రణాళిక తయారు చేసుకుని దానిని తు.చ.తప్పకుండా అమలు చేయాలంటే దీక్ష, పట్టుదల అత్యవసరమని చెప్పారు. అనంతరం ఎమ్మెల్సీ కేఎల్ లక్ష్మణరావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వీసీ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎస్.వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, ఎంహెచ్‌ఎస్ డీన్ డాక్టర్ ఎం. కిషోర్‌బాబు, ఉప విభాగాధిపతి డాక్టర్ కె.అనిల్ కుమార్, డాక్టర్ ప్రజాపతి, మునీష్ పాల్గొన్నారు.

25 నుంచి వేసవి శిక్షణ శిబిరం



తాడేపల్లిరూరల్: మంగళగిరి- తాడేపల్లి బాలోత్సవం ఆధ్వర్యంలో ఈనెల 25 నుంచి మే 5వ తేదీ వరకు బాలల హరివిల్లు–2024 వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు బాలోత్సవాల రాష్ట్ర కన్వీనర్ పిన్నమనేని మురళీకృష్ణ తెలిపారు. తాడేపల్లిలోని ఓ ప్రైవేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశం మంగళవారం వివరాలు వెల్లడించారు. బాలోత్సవం కోశాధికారి గాదె సుబ్బారెడ్డి మాట్లాడుతూ పది రోజుల పాటు వేసవి శిక్షణ శిబిరాన్ని అమరావతి ఐకాన్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహిస్తున్నామని చెప్పారు. 4 నుంచి 6వ తరగతి వరకు జూనియర్స్‌గా, 7 నుంచి సీనియర్స్‌గా విభజించి బెస్ట్ ఫ్రమ్ వేస్ట్, నిత్యజీవితంలో సైన్స్, పాటలు, చిత్రలేఖనం, కథలు రాయించడం, హ్యాండ్ రైటింగ్, మ్యూజిక్, గణితం, సులభంగా ఇంగ్లిష్ నేర్చుకోవడం వంటి రంగాల్లో నిష్ణాతులైన వారిచే శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు శిక్షణ ఉంటుందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అమరావతి ఐకాన్ బాధ్యులు వై. బాలకృష్ణ, నిర్వాహకురాలు జి.రమ్య మాట్లాడుతూ పిల్లల్లో దాగి సృజనాత్మకను బయటకు తీయడానికి వేసవి సెలవులను కూడా విజ్ఞాన సముపార్జనకు తోడ్పడే విధంగా చూస్తామన్నారు. అనంతరం వేసవి శిక్షణ తరగతుల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో విజయవాడ అమరావతి బాలోత్సవం ఐజాక్ నూటన్, ఎంటీఎంసీ బాలోత్సవం కార్యదర్శి పి. శ్రీలక్ష్మి, అమరావతి ఐకాన్ మహిళా విభాగం వై.సుధన, కె.సతీష్, బిట్రా రామారావు పాల్గొన్నారు.